క్లుప్తంగా

నేడు మున్సిపాలిటీపై అవగాహన సదస్సు

అశ్వారావుపేటరూరల్: కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీపై పుర ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేడు(సోమవారం) ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేసినట్లు స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనం ఆవరణలో ఉదయం 10గంటలకు 'మన మున్సిపాలిటీ–మన అభివృద్ధి' అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తారని, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరు కానున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజానీకం హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు బీఆర్ఎస్ ధర్నా

పినపాక: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గారెంటీలను అమలు చేయాలని, సీతారామ ప్రాజెక్టు నీరు పినపాక నియోజకవర్గానికి అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ధర్నాలో పినపాక నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పాల్గొంటారని తెలిపారు.

లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న డైరెక్టర్ ప్రసాద్‌బాబు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ కళాశాల విద్యార్థులు ఆదివారం ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లోనూ సత్తాచాటారు. కళాశాల విద్యార్థి జాహ్నవి ఓపెన్ క్యాటగిరిలో 1643వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు ర్యాంకును కైవసం చేసుకున్న విద్యార్థినికి మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు బషీర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నీటి బొట్టు.. 'భగీరథ' యత్నమే!



వాల్వ్ వద్ద లీకేజీ నీటిధారను డ్రమ్ములోకి చేరేలా ఏర్పాటు చేసిన సిమెంట్ రేకు..

అశ్వారావుపేటరూరల్: మండు వేసవి కాలంలో చుక్క నీటి బొట్టు విలువ వెలకట్టలేనిది. చుక్క చుక్కగా పడుతున్న నీటి బొట్టును ఒడిసిపట్టుకొని ఔరా అనిపిస్తున్నాడు. అశ్వారావుపేటలోని సత్తుపల్లి మార్గంలో రహదారి పక్కనే పోకల బజార్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్‌కు సంబంధించిన ఏయిర్‌వాల్వ్ ఉంది. కాగా, గడిచిన కొద్ది రోజులుగా ఈ ఏయిర్‌వాల్వ్ నుంచి తాగునీరు లీకేజీ ద్వారా వృథాగా పోతుంది. కాగా, అదే ప్రాంతానికి చెందిన రాము అనే వ్యక్తి, ఏయిర్‌వాల్వ్ వద్ద పోతున్న నీటి ధార దగ్గర పగిలిన సిమెంట్ రేకును ఏర్పాటు చేసి, దానిగుండా ఖాళీ డ్రమ్ములోకి నీరు చేరేలా ఏర్పాటు చేసుకున్నాడు. ఆ నీటినే తమ అవసరాలకు వాడుకుంటున్నాడు. నీటి విలువను వ్యక్త పరిచే ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి కెమెరాలో క్లిక్ మనిపించింది.

దళితులకు పెద్దపీట

అశ్వాపురం: తెలంగాణలో దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చా నరసింహారావు అన్నారు. మండల పరిధిలోని మల్లెల మడుగు గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 10 ఏండ్ల కాలంలో బీఆర్ఎస్ పాలనలో దళితులకు ఇవ్వాల్సిన ఉన్నత పదవులు ఇవ్వకుండా అహంకారంగా దొరల పాలన సాగించారన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు చెంచల రాము, గొడ్ల నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరాగా, అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కూడా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

మట్టి మైనింగ్‌పై గిరిజనుల నజర్

- అక్రమ రవాణా అడ్డగింత
- అనుమతులపై ప్రశ్నిస్తున్న వైనం
- పలుచోట్ల ఘటనలు.. దళారుల్లో దడ

అనేక చోట్ల అక్రమ మైనింగ్‌పై గిరిజనులు తిరగబడుతున్నారు. దీని వెనుక వారికేమి వ్యక్తిగత కక్షలు లేవు. తమ సొంత గ్రామంలో తమ సొంత అవసరాలకు మట్టిని తవ్వుకోడానికి అనుమతులు లేవంటూ అధికారులు నిలిపివేస్తున్నారు. కాని అదే మట్టిని ఇతరులు తరలించుకుపోతున్నారు. కడుపుమండిన ఆదివాసులు ఒక్కొక్కరిగా ప్రశ్నిస్తున్నారు. మట్టి తరలింపులను నిలిపివేస్తూ.. ఆందోళనలు చేస్తున్నారు.



అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటున్న గిరిజన యువత (ఫైల్)

దమ్మపేట: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ మట్టి మైనింగ్‌పై స్థానిక గిరిజనులు కన్నెర్ర జేస్తున్నారు. దాడులు చేయాల్సిన అధికారులు నిద్రాణవస్థలో ఉండగా.. ఆ పనిని చేపట్టడం స్థానిక ప్రజలవంతవుతోంది. మండలంలోని అప్పారావుపేట గ్రామ శివారులో ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. ఆ సమయంలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న జేసీబీ యంత్రము వద్దకు పదుల సంఖ్యలో స్థానిక గిరిజన యువత చేరుకుని, అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారులకు అక్రమ మైనింగ్‌పై ఫోన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్ పాల్పడ్డ జేసీబీ యంత్రాన్ని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించే వరకు అధికారులపై ఒత్తిడి ఆపలేదు. ఇదే సంఘటనలో పలు గ్రామాల్లో చోటు చేసుకుంటున్నారు.

సామాన్యులపై భారం.. దళారులకు కాసులు

సామాన్యుల తమ వ్యక్తిగత, గృహ సంబంధిత అవసరాలను మట్టిని సేకరించాలంటే నానా తంటాలు పడుతున్నారు. మట్టి కోసం దళారులు, రాజకీయ నాయకులు, జేసీబీ యజమానులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఈ దళారులు అనధికారిక అనుమతులకు నజరానా ముట్ట చెప్పాలని, అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఒక ట్రాక్టర్ ట్రక్కులోకి జేసీబీతో మట్టిని నింపడానికి 150 రూపాయలు, అక్కడి నుంచి ట్రాక్టర్‌లో మట్టిని తరలించడానికి 400 రూపాయలు.. మొత్తంగా కలిపి 550 రూపాయలు ఖర్చు అవుతుంది. కానీ దళారులు అనధికార అనుమతుల పేరు చెప్పి, రూ.800 నుండి రూ.1000ల వరకు వసూలు చేస్తున్నారు. ఈ అధికంగా వసూలు చేసిన డబ్బంతా దళారుల జేబుల్లోకి వెళ్తోంది. దీంతో సామాన్యులు మట్టి కోసం అసలు కంటే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

మట్టి అనుమతులు ఇలా..

ఏదైనా గ్రామంలోని తమ సొంత స్థలంలో మట్టిని తవ్వుకోవాలంటే, దానికి సంబంధించిన అనుమతులను జిల్లా కేంద్రంలోనున్న మైనింగ్ అధికారుల నుంచి తీసుకోవాలి. దీనికోసం ముందుగా స్థానిక తహసీల్దార్‌కు, తమ స్థలానికి సంబంధించిన ధ్రువపత్రాలను జతపరుస్తూ, దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్.. ఆ స్థలము వ్యవసాయానికికు పనికిరాదని సంబంధిత వ్యవసాయ అధికారుల ధ్రువీకరణ పొందిన తర్వాత, ఆ దరఖాస్తును మైనింగ్ శాఖ అధికారులకు పంపుతారు. వారు సంబంధిత స్థలాన్ని పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాత మాత్రమే అనుమతులను ఇస్తారు. కానీ ఒక సామాన్యుడు తన అవసరం కోసం ఇదంతా చేయలేని పరిస్థితి.

గిరిజనులకు అనుమతి ఇవ్వాలి



గిరిజన ప్రాంతాల్లో నివసించే గిరిజనులు మట్టి కోసం అనేక తంటాలు పడాల్సి వస్తుంది. దీనికోసం దళారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. మా గిరిజన ప్రాంతంలో లభించే మట్టి కోసం మేము ఇతరులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్థానిక గిరిజనులకు గృహ సంబంధిత నిర్మాణాలకు అవసరమైన మట్టి కోసం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇవ్వాలి. అక్రమ మైనింగ్‌తో అధిక వసూళ్లకు పాల్పడుతున్న దళారులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– ఊకే బుల్లిబాబు, ఆదివాసీ నాయకుడు

సామాన్యులను ఇబ్బంది పెట్టకూడదు..



గృహ నిర్మాణాలకు అవసరమైన మట్టిని తవ్వుకునే సామాన్యులను, వ్యవసాయ క్షేత్రాల్లో వాహనాల రాకపోకలకు అనుగుణంగా నిర్మించే మట్టి రోడ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు. వ్యాపార సంబంధిత అవసరాల కోసం అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న దళారీ వ్యవస్థను నియంత్రించి, సామాన్యులకు మట్టిని సరసమైన ధరలో అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– చిన్నశెట్టి శ్రీనివాసరావు, రైతు, దమ్మపేట

గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో సారాయి మత్తుకు బానిసలవుతున్న యువత
- కన్నెత్తి చూడని ఎక్సైజ్‌శాఖ



మణుగూరురూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటోంది. దట్టమైన అటవీ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలను ఏర్పాటు చేసుకుని వేలకొద్ది సారాయిని తయారు చేసి చిన్న చిన్న దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం ధరలకు రెక్కలు రావడంతో యువకులు, వృద్ధులు నాటుసారాయి కోసం వెంపర్లాడుతున్నారు. తక్కువ ధరకే సారాయి దొరుకుతుండడంతో విక్రయాలు జోరుగా కొనసాగుతూ తయారీ దారులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. గ్రామాల్లోనే కాకుండా రాను రాను పట్టణానికి కూడా విస్తరించింది. ఈ గుడుంబా రక్కసికి గతంలో ఎంతోమంది తమ బ్రతుకులను నాశనం చేసుకోవడమే కాకుండా అనేకమంది తమ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు లేకపోలేదు.

ఆందోళనలో ప్రజలు..

ఇప్పటికే పలువురు మద్యానికి బానిసలై ఆరోగ్యాలను కరాబు చేసుకుంటున్న నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ గుండుంబా విస్తరించడం పలు కుటుంబాల్లో ఆందోళన నింపుతోంది. దీనివల్ల తమ బతుకుల్లో చీకట్లు నిండుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో గుడుంబా వాసనలు గుప్పుమంటున్నప్పటికీ అరికట్టే నాథుడే లేడా అని ప్రశ్నిస్తున్నారు.

నిర్లక్ష్యం.. మామూళ్లు..

తెలంగాణ ప్రభుత్వం గుడుంబాను నిషేధించినా.. ఎక్సైజ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దట్టమైన అటవీ ప్రాంతాల్లో సారా తయారీ స్థావరాలను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా సారాయిని తయారు చేస్తున్నారు. గుడుంబా స్థావరాలలు, విక్రయాలపై దాడులు చేయకపోవడం వల్లే సారాయి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల మత్తులో జోగుతుండడమే ఇందుకు కారణంగా సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి విరివిగా తీసుకోని వెళ్లాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ పసుమర్తి సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని మండల బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు కంద్రపు త్రినాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సతీష్ మాట్లాడుతూ.. 11 సంవత్సరాలలో భారతీయ జనతా పార్టీ ప్రజలకు అందించిన పాలన, ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలు, ఆయుష్మాన్ భారత్, నేషనల్ హైవేలు, రైల్వే ప్రాజెక్టుల వివరాలను వివరించారు. జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాలను గెలిపించుకుని కేంద్ర భారతీయ జనతా పార్టీకి బహుమతిగా ఇవ్వాలని, ప్రతి కార్యకర్తల దాని గురించి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజ ధర్మా, నాయకులు పొందుగల అంజిరెడ్డి, పలికల రుక్మిణి కుమారి, డేగల సురేష్, కుప్పాల కృష్ణారెడ్డి, కుప్పిలి భద్ర రావు, చింతమల హేమంత్, ఆకుల సాయి, కుంజా బాలకృష్ణ, సరియం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల రేషన్ ఇవ్వాలి



అశ్వారావుపేటరూరల్: జీసీసీ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని అందించాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జీసీసీ డీలర్లకు సూచించారు. ఆదివారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలోని జీసీసీ రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. బియ్యం నిల్వలు, నాణ్యత, రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే రేషన్ బియ్యం అందిస్తున్నామని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం డీలర్‌తో మాట్లాడుతూ.. లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టకుండా, తూకంలో వ్యత్యాసం లేకుండా ఇవ్వాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల్లో లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిర్ణీత విస్తీర్ణంలోనే నిర్మించాలి

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిని మించకుండా, నిర్ణీత విస్తీర్ణంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో పునాది వరకు నిర్మించి ఉన్న ఇందిరమ్మ ఇంటిని, ఎమ్మెల్యే జారే పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇంటిని నాణ్యతతో సక్రమంగా నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, దొడ్డా భాస్కరరావు, కర్లపూడి బాలు, లవకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మణుగూరురూరల్: 2024–25 విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మణుగూరు మండల కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమానికి మణుగూరు సీఐ పాటి నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు అంచుమల్ల సిరి, తమ్మినేని సాత్విక, దొడ్డపనేని వర్షిని, మందలపు దీక్షిత, గోగినేని సాయిసన్‌హిత్, దమ్మాల పాటి జ్వలితా చౌదరిలను శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.10వేలు అందజేస్తానని ఉడతానేని రామారావు ఈ సందర్భంగా ప్రకటించారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సంఘం చేయూతగా నిలుస్తుందన్నారు.

39 ఏళ్లకు ఒకే చోట..



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర జిల్లా పరిషత్ పాఠశాలలో 1986–87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగా కలుసుకున్నారు. 39 సంవత్సరాల తరువాత అందరూ ఒక్క చోటకు చేరి తమ పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. రోజంతా సరదాగా, ఉత్సాహంగా గడిపారు. తమ గురువులను సన్మానించారు.

మృగశిర కార్తె సందడి



కరకగూడెంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మృగశిర కార్తె సందర్భంగా మార్కెట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం చేపల కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. కొత్త మార్కెట్‌తో పాటు చర్ల రోడ్, కూనవరం రోడ్, ఐటీడీఏ రోడ్‌లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. అధిక ధరలు ఉన్నా ప్రజలు కొనుగోలుకు వెనకాడలేదు. మృగశిర కార్తె రోజున తప్పనిసరిగా చేపలు తినాలనే ఉద్దేశంతో పాటు ఆదివారం కావడంతో అధిక ధరలకు కొనుగోలు చేశారు. నిత్యం కిలో రూ.200 నుంచి రూ.230 వరకు ఉండే చేపల ధరలు.. రూ.300 నుంచి రూ. 400 వరకు చేరాయి. ఇక కొరమీను కిలో ధర వెయ్యి రూపాయలకు పెరిగింది. గోదావరి చేపలు సైతం భారీ ధరలకు విక్రయించారు.

కరకగూడెం: మృగశిర కార్తె ప్రవేశంతో ఆదివారం మండలంలో సందడి వాతావరణం నెలకొంది. మండల వాసులు స్థానిక చెరువులు, మార్కెట్‌లో చేపలను కొనుగోలు చేశారు. మృగశిర కార్తె రోజున చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదని విశ్వసిస్తున్న నేపథ్యంలో చాలామంది ఈ రోజు చేపలను తమ ఆహారంలో భాగం చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.



భద్రాచలంటౌన్‌: చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు



కరకగూడెం: చెరువు వద్ద పెద్ద చేప చిక్కడంతో యువకుడి ఆనందం..

సాగులో అప్రమత్తతే కీలకం

- నకిలీలకు దూరంగా ఉంటేనే అధిక దిగుబడులు
- తనిఖీలకే పరిమితమైన అధికారులు
- అవగాహన కల్పనలో వెనుకంజ



కరకగూడెంలోని ఓ విత్తన దుకాణంలో పత్తి ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్న రైతులు



ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్సైలు

కరకగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే జీవనాధారం. ప్రస్తుతం మండలంలో తొలకరి వానలకు ఖరీఫ్ వ్యవసాయ కార్యకలాపాలు ఇప్పుడిప్పుడే ఊపందుకున్నాయి. వరి, పత్తి సాగు వైపు రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాల బెడద రైతన్నలను కలవరపెడుతోంది. ఇటువంటి సందర్భంలోనే విత్తనాలు, ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలకు సంబంధించి వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతునారు. కానీ క్షేత్ర స్థాయిలో రైతులకు నకిలీలపై అవగాహన కల్పించడంలో వెనుకబడి ఉన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు 'సాక్షి'పలు సూచనలిస్తోంది.

విత్తనాలను ఇలా ఎంపిక చేసుకోండి..

- విత్తనాలను తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తించిన సంస్థలు లేదా అధీకృత డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- విత్తన ప్యాకెట్‌పై ధృవీకరణ ముద్ర (సీడ్ సర్టిఫికేషన్ ట్యాగ్) ఉందని నిర్ధారించుకోవాలి. ఇది విత్తనాల నాణ్యతకు హామీ ఇస్తుంది.
- కాలపరిమితి తేదీలు, సాగు చేయాల్సిన కాలం వంటి వివరాలను ప్యాకెట్‌పై సరిచూసుకోవాలి.
- తమ ప్రాంత వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, పంట కాలానికి అనుగుణంగా విత్తన రకాన్ని ఎంచుకోవాలి. అధిక దిగుబడితోపాటు చీడ పీడలను తట్టుకునే రకాలను తెలుసుకోవాలి.
- తెగుళ్లు, వ్యాధుల నుంచి పంటను రక్షించడానికి విత్తన శుద్ధి తప్పనిసరి. అవసరమైతే విత్తన శుద్ధి మందులను వాడాలి.

ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు..

- ఎరువులను తగిన మోతాదులో మాత్రమే వాడాలి. లేదంటే నేల సారం దెబ్బతింటుంది.
- ఎరువులు వాడే ముందు నేలసార పరీక్ష (సాయిల్ హెల్త్ కార్డ్) చేయించుకోవడం ద్వారా నేలలోని పోషక లోపాలను గుర్తించి, తగిన ఎరువులను ఎంచుకోవచ్చు.
- రసాయన ఎరువులతో పాటు, సేంద్రియ ఎరువులు (పచ్చిరొట్ట, గొర్రె ఎరువు), జీవ ఎరువులను వాడటం ద్వారా నేల సారాన్ని కాపాడవచ్చు.
- ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్రాండ్లను ఎంచుకోవాలి. నకిలీ లేదా నాసిరక ఎరువులను నివారించడానికి బిల్లు, ప్యాకేజింగ్ వివరాలను తనిఖీ చేయాలి.
- నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులను సమతుల్యంగా వాడాలి. అధిక రసాయన ఎరువుల వాడకం నేలను నిస్సారంగా మార్చే అవకాశం ఉంది.
- సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలు చేస్తాయి.
- పంటల వివిధ దశల్లో (విత్తనం పెరుగుదల, పుష్పించే సమయం) ఎరువులను తగిన మోతాదులో వాడాలి.

పురుగు మందుల విషయంలో..

- పురుగు మందుల నాణ్యతను కేంద్ర పురుగు మందుల బోర్డు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదీ లేనిది తనిఖీ చేయాలి. నాసిరక బ్యాచ్‌లను నివారించాలి.
- జీవ సంబంధిత పద్ధతులు (మిత్ర పురుగులు, ఉచ్చులు, సేంద్రియ పురుగు మందులను ఉపయోగించడం ద్వారా రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రక్షణ దుస్తులు (గ్లౌజులు, మాస్క్) ధరించాలి. వాడిన డబ్బాలను సురక్షితంగా పారవేయాలి.
- పురుగు మందులను చల్లిన పొలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ఇతరులను అలర్ట్ చేయొచ్చు.
- పురుగు మందుల వల్ల విష ప్రభావం కలిగితే, వెంటనే ప్రాథమిక చికిత్స చేసి, వైద్య సహాయం తీసుకోవాలి. పురుగు మందులను సాయంత్రం లేదా ఉదయం వేళల్లో, గాలి తక్కువగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

నకిలీలపై అవగాహన కల్పించాలి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విషయంలో సరైన అవగాహన లేక అన్నదాతలు నష్టపోతున్నారు. వ్యవసాయ అధికారులు దీనిపై అవగాహన కల్పించాలి. నకిలీలను అరికట్టాలి. నకిలీ ఉత్పత్తులు మా కష్టాన్ని, పెట్టుబడిని వృథా చేస్తున్నాయి.

– షేక్ జానీమియా, రైతు, కరకగూడెం

సమాచారం అందించాలి



రైతులు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన విత్తన కేంద్రాల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. నకిలీల ఉత్పత్తుల గురించి ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలి.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416